నిరసన చేపడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

‘తల్లికి వందనం’ కోత

- రూ.15వేలు ఇస్తామని రూ.13వేలే జమ
- లబ్ధిదారుల తగ్గింపునకు మరిన్ని నిబంధనలు
- వ్యక్తమవుతున్న అసహనం

తల్లికి వందనం పేరుతో ప్రతి బిడ్డకూ రూ.15వేలు చొప్పున తల్లి ఖాతాలో జమ చేస్తామని ఎన్నికలకు ముందు మేనిఫెస్టోలో ప్రకటించారు. అధికారంలోకి వచ్చాకా పథకం అమలు అప్పుడు ఇప్పుడు అంటూ చివరికి తల్లుల ఖాతాల్లో జమ చేశారు. అయితే చెప్పిన దాంట్లో రూ.2వేలు కోత పెట్టి రూ.13 మాత్రమే జమ చేశారు. దాంతో పాటు లబ్ధిదారుల సంఖ్యను తగ్గించేందుకు మరిన్ని నిబంధనలతో మార్గదర్శకాలు విడుదల చేశారు. దీంతో లబ్ధిదారుల్లో అసహనం వ్యక్తం అవుతోంది...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఎన్నికలకు ముందు టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో తల్లికి వందనం పేరుతో ప్రతి ఇంటిలో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మంది పిల్లలకూ వారి తల్లుల ఖాతాల్లో రూ.15 వేలు జమ చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే.. 2025 విద్యా సంవత్సరం నుండి ఈ పథకాన్ని అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో అధికారం చేపట్టి ఏడాది అయిన సందర్భంగా 12 వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తల్లికి వందనం పథకాన్ని ప్రారంభించారు. కర్నూలు జిల్లాలో 3,67,614 మంది విద్యార్థులను అర్హులుగా ప్రకటించారు. వారికి సంబంధించిన తల్లికి వందనం డబ్బులను వారి తల్లుల ఖాతాల్లో శుక్రవారం నుంచి జమ చేయడం ప్రారంభించారు. అయితే చెప్పినట్లు రూ.15వేలు కాకుండా రూ.13 వేలు మాత్రమే జమ చేశారు. రూ.2 వేలను పాఠశాల అభివృద్ధి కోసం కోత విధిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. కూటమి ప్రభుత్వం తీరుపైన లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దానికి తోడు తాజాగా జారీ చేసిన మార్గదర్శకాల్లో మరిన్ని నిబంధనలు విధించారు. దీంతో లబ్ధిదారుల సంఖ్యలో కోత విధించే అవకాశం ఉందని అనుమానాలు వ్యక్తం

అవుతున్నాయి. విద్య హక్కు చట్టం కింద ప్రైవేట్ స్కూళ్లలో అడ్మిషన్లు పొందిన వారికి సొమ్ము పూర్తిగా ఇవ్వరు. ఆయా స్కూళ్ల మేనేజ్మెంట్లకు చెల్లించాల్సిన ఫీజులు ఈ సొమ్ము నుంచి మినహాయించి మిగతావి లబ్ధిదారుల తల్లులకు అందజేస్తారు. తల్లికి వందనం లబ్ధికి కుటుంబాదాయం నెలకు గ్రామాల్లో రూ.10వేలు, పట్టణాల్లో రూ.12 వేలకు మించకూడదని నిబంధన విధించారు. ఫోర్ వీలర్ ఉండకూడదని ఆ నిబంధనల్లో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగం 300 యూనిట్లకు మించరాదని, పట్టణాల్లో వెయ్యి చదరపు గజాలకు మించి ఆస్తి ఉండకూడదని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. విద్యార్థికి తప్పనిసరిగా 75 శాతం హాజరు ఉండాలని, కుటుంబానికి తప్పనిసరిగా తెల్ల రేషన్ కార్డు ఉండాలని నిబంధన విధించారు. ఫీజు రియంబర్స్మెంట్ వచ్చే విద్యార్థికి తల్లికి వందనం వర్తించదని తెలిపారు. ఈ నిబంధనల పట్ల లబ్ధిదారుల నుంచి అసహనం వక్తం అవుతోంది. గత ప్రభుత్వ మాదిరే డబ్బుల్లో కోత పెట్టి జమ చేయడం ఏమిటని, గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి తేడా ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

కోత పెట్టి వేశారు

ఎన్నికలకు ముందు టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఎంత మంది పిల్లలుంటే అందరికీ రూ.15 వేల చొప్పున వేస్తామని చెప్పారు. అయితే రూ.13వేలే జమ చేశారు. ఒక్కొక్కరికి రూ.15వేలు పడతాయని ఆశ పెట్టుకున్నాం. తీరా చూస్తే రూ.2 వేలు కోత పెట్టారు. ఇది నిరాశ పరచింది. మొత్తం డబ్బులు జమ చేసి ఉంటే బాగుడేంది.

- మద్దిలేటి, ఉల్చాల, కర్నూలు రూరల్ మండలం.

విద్యార్థులకు ‘కూటమి’ మోసం

- తల్లికి వందనం నిబంధనలు సడలించాలి - ఎస్ఎఫ్ఐ నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

తల్లికి వందనం పథకంలో నిబంధనలు పెట్టడాన్ని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నగరంలోని సుందరయ్య సర్కిల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి నగర కార్యదర్శి సాయి ఉదయ్ అధ్యక్షత వహించగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్లా, రంగప్ప మాట్లాడుతూ 2024 ఎన్నికలప్పుడు ప్రస్తుత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ప్రతి విద్యార్థికి ఎలాంటి నిబంధనలు లేకుండా రూ.15వేల నేరుగా తల్లి బ్యాంక్ ఖాతాలో జమచేస్తామని చెప్పి ప్రస్తుతం తల్లికి వందనం అమలకు నిబంధనలు చూసి ప్రజలు వాపోతున్నా రు. అధికారులు, మంత్రుల సమావేశాల సందర్భం లో ప్రస్తావన రాని జీఓ 26, 27 నిన్నటికి నిన్న గుర్తుకు రావటానికి గల కారణం ఈ పథకానికి అర్హులుగా ఉన్న విద్యార్థులను అనర్హులుగా గుర్తించ డానికి చేసిన కుట్రపూరిత చర్యేనన్నారు. పైగా విద్యార్థుల లెక్కలు చెప్పేందుకు దేశంలో యూడైస్ డేటానే ప్రామాణికంగా విద్యార్థులు ఉన్నారన్న సమగ్ర సమాచారంలో సేకరించి విద్యార్థుల జాబితాన్ని తయారు చేయకుండా కేవలం రాష్ట్ర వ్యాప్తంగా 67,27,164 మంది లబ్దిదారులని చెప్పి, అందులో కూడా ఇచ్చేది మాత్రం 54,94,703 మందికి చేయడమంటే నిలువునా విద్యార్థులు తల్లిదండ్రులను మోసం చేయడమేనన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రాష్ట్ర విద్యాశాఖ అధికారి సమగ్రమైన విద్యార్థుల సమాచారాన్ని సేకరించి ఒకటవ తరగతి ఇంటర్నెట్ మొదటి సంవత్సరంలో చేరబోయే విద్యార్థులకు తల్లికి వందనం రూ.15వేలు ఇవ్వాలన్నారు. జీవో 26, 27 ల ప్రకారం ఒక ఇంట్లో ఒకరు ఫీజు రీయింబర్స్మెంట్ పొందుతున్నట్లయితే, అదే ఇంట్లో ఇతరులకు తల్లికి వందనం వర్తించదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ఉపకార వేతనాలు పొందే వారికి పథకం రద్దవుతుందన్నారు. కుటుంబానికి బియ్యం కార్డు లేకుంటే పథకం రాదని, కుటుంబ నెలవారీ ఆదాయం గ్రామీణులకు రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలు మించితే పథకం ఇవ్వరని, మాగాణి 3 ఎకరాలు, మెట్ట అయితే 10 ఎకరాలు మించి ఉండరాదని, పట్టణాలల్లో 1000 చ.అడుగుల స్థలం ఉన్నా, నాలుగు చక్రాల సొంత వాహనం ఉన్నా పథకం వర్తించదన్నారు. ప్రతి కుటుంబానికి ఏడాది విద్యుత్ వినియోగాన్ని పరిగణనలోకి తీసుకుని నెలకు 300 యూనిట్లు మించి విద్యుత్ వినియోగించి ఉంటే పథకం రాదని, ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షన్ పొందుతున్న వారు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలు వేతనం పొందుతున్న వారికి పథకం రాదన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాల కింద ప్రీ-మెట్రిక్, పోస్ట్-మెట్రిక్ స్కాలర్షిప్స్ పరిధిలోకి వచ్చే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఆ పథకాల కింద ఆయా శాఖలు అందిస్తున్న మొత్తం మినహాయించి, మిగిలిన నగదును మాత్రమే ‘తల్లికి వందనం’ పథకం కింద చెల్లిస్తారన్నారు. సచివాలయాల్లో ప్రదర్శించిన లబ్దిదారుల జాబితాలో ఎవరిపై అయినా ఫిర్యాదులొస్తే పథకాన్ని ఆపివేయాలని ఈ నిబంధనలను పూర్తిగా వ్యతిరేకిస్తూ ఏదైతే ఎన్నికల్లో చెప్పిన విధంగా ప్రతి విద్యార్థికి రూ.15వేల ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థులందరిని కలుపుకొని రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కర్నూలు నగర అధ్యక్షులు అబూబకర్, నగర ఉపాధ్యక్షులు ఆర్యన్, మల్లేష్ నగర సహాయ కార్యదర్శి పృధ్వి, ఆదిత్య నగర కమిటీ సభ్యులు యోగి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు యోగా ప్రదర్శనలు

– టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రంజిత్ బాష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా గుర్తించిన అన్ని వేదికల్లో శనివారం యోగా ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు పి. రంజిత్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం యోగాంధ్ర నిర్వహణపై నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లు, మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపిడిఒలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు తదితరులతో జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 14న శనివారం ఉదయం 07 గంటలకు జిల్లా వ్యాప్తంగా 6,149 వేదికల్లో నిర్వహించే యోగా ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. ఆ మేరకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వేదికల వద్ద యోగా మ్యాట్లు, తాగునీరు, తదితర ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు, విద్యార్థులు, డ్వాక్రా మహిళలు, ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న యోగా ఔత్సాహికులు, యోగా శిక్షకులు చురుగ్గా ఈ కార్యక్రమంలో పాల్గొనేలా ప్రోత్సహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇంతవరకు యోగాంధ్ర కార్యక్రమం లో పాల్గొనేందుకు 10,91,993 మంది తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, వారందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. టెలి కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆర్‌డిఒలు భరత్ నాయక్, సందీప్ కుమార్, జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి, సెట్కూర్ సిఇఒ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అంతా నాసిరకమే..!

- పర్యవేక్షణ చేయని ఉన్నతాధికారులు
- కమీషన్లను దండుకుంటున్న వైనం
- రూసా నిధులు రూ.20 కోట్లతో పనులు

ప్రజాశక్తి-కర్నూల్ కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ (రూసా) నిధులతో నాసిరకమైన పనులను చేపడుతున్నారు. ఈ పనులను పర్యవేక్షించడంలో మాత్రం వర్సిటీ ఉన్నతాధికారులు వైఫల్యం చెందారు. కాంట్రాక్టర్ నుండి పెద్ద ఎత్తున కమిషన్లను దండుకుంటున్న పరిస్థితి నెలకొంది. రాయలసీమ వర్సిటీ పరిధిలో రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ (రుసా) దాదాపు రూ.20 కోట్లకు పైగా నిధులు విడుదలయ్యాయి. ఇందులో దాదాపుగా రూ.10 కోట్లతో వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల భవన నిర్మాణ పనులను చేపడుతున్నారు. మరో 10 కోట్లతో వర్సిటీ పరిధిలోని హాస్టల్స్ మరమ్మతుల , వర్సిటీ పరిపాలన భవనం మరమ్మతులకు సంబంధించిన పనులను నిర్వహిస్తున్నారు. గతంలో వర్సిటీకి ఈ పథకం కింద నిధులు మంజూరు అయితే వాటిని వినియోగించుకోవడంలో అప్పటి ఉన్నత అధికారులు అలసత్వం వహించారు. వెంటనే ఈ నిధులను రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ అధికారులు తిరిగి లాక్కున్నారు. ఇన్చార్జి వైస్ విసి ఎన్‌టికె నాయక్ ఉన్నత విద్యాశాఖ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి తిరిగి నిధులను వర్సిటీ అభివృద్ధి పనులకు రాబట్టారు. రూ.20 కోట్లకు నిధులను ఉన్నత విద్యాశాఖ అధికారులు మంజూరు చేశారు. ప్రస్తుతం వర్సిటీ ఉన్నతాధికారులు మంజూరైన నిధులతో పనులను చేపడుతున్నారు. వర్సిటీ పరిధిలో ఉన్నటువంటి హాస్టల్స్‌లో అనేక సౌకర్యాలు లేకపోవడంతో ఈ నిధుల ద్వారా వసతులు కల్పనకు చర్యలు చేపట్టారు. వర్సిటీకి సంబంధించిన ఇంజనీరింగ్ కళాశాల భవన నిర్మాణ పనులను కూడా ఈ నిధుల ద్వారానే చేపడుతున్నారు. ఈ భవన నిర్మాణాలు పరిశీలన చేస్తే అంతా నాసిరకంగా చేపడుతున్నారు.. ప్రస్తుతం కట్టినటువంటి భవనాలకు కనీసం క్యూరింగ్ కూడా చేయడం లేదు. నాసిరక నిర్మాణ పనులను చేపడుతూ త్వరగా పనులను పూర్తి చేస్తున్నారు. భవన నిర్మాణ పనులకు వినియోగిస్తున్న వస్తువులు కూడా నాణ్యత లోపించినటు వంటి వాటిని వాడుతున్నారు. కాంట్రాక్టర్‌తో వర్సిటీకి చెందిన ఉన్నతాధికారులు కుమ్మక్కై పెద్ద ఎత్తున కమిషన్లను కూడా వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న భవనాలు ఎన్ని సంవత్సరాలు ఉంటాయో కూడా చెప్పలేనటువంటి పరిస్థితి ఉంది. వర్సిటీలోని ఇంజనీరింగ్ విభాగానికి చెందిన అధికారి కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై కమిషన్లను వసూలు చేస్తున్నారు. ఇందులో వర్సిటీలోని ఇద్దరు కీలకమైన ఉన్నతాధికారులకు కూడా భాగస్వామ్యం ఉన్నట్లు తెలిసింది. నాసిరకమైనటువంటి భవన నిర్మాణ పనులను చేపడితే భవిష్యత్తులో త్వరగా ఈ భవనాలను మరమ్మతులు చేయాల్సి ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వర్సిటీ ఉన్నతాధికారులు కమిషన్ల వసూళ్లకు పాల్పడకుండా నాణ్యత ప్రమాణాలతో నిర్మాణ పనులు జరిగేలా చూడాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

నిర్మాణం చేపడుతున్న భవనం

సమావేశంలో మాట్లాడుతున్న గురుశేఖర్

ఎన్నికల వాగ్దానాలు అమలు చేయాలి

ఎపి రజక వృత్తిదారుల సంఘం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆం ధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం కర్నూలు జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం సంఘం కర్నూలు జిల్లా వీరనారి రజక ఐలమ్మ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సి. ముక్కన్న అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేఖర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు రజక వృత్తిదారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారను. ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన వాటిని ఏ ఒక్కటి కూడా నేటికీ అమలు చేయలేదన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు రజక కార్పొరేషన్ నిధుల కేటాయింపు దేవాదాయ శాఖలో రజక వత్తిదారులకు కమిటీలు స్థానం, కుంటలు, చెరువులు జీవో నెంబర్ 343 ప్రకారం అమలు సామాజిక రక్షణ చట్టం చట్టసభల్లో నామినేటెడ్ పోస్టులు, విశ్వకర్మ కౌశల్య యోజన పథకం ద్వారా లబ్ధి పొందిన వారికి రుణాలు పనిముట్లు ఇస్తామని చెప్పి ఎన్నికల ముందు వాగ్దానం చేసిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయిన ఏ ఒక్కటి కూడా అమలు చేయలేదని విమర్శించారు. జిల్లాలోని రజక వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. లేని యెడల రాబోయే కాలంలో వృత్తిదారులను ఐక్యం చేసి పోరాటాలకు సిద్ధం కావాలని రజక వృత్తిదారులను కోరారు. జిల్లా ట్రెజరర్ సి.హెచ్. శ్రీనివాసులు, న్యూ సిటీ కార్యదర్శి శేషాద్రి, అధ్యక్షుడు సి.రాముడు ఓల్డ్ సిటీ అధ్యక్ష కార్యదర్శులు జయమ్మ, సి.శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్. శేఖర్ బాబు, సహకార దర్శి సి. ఈరన్న ,జిల్లా కమిటీ సభ్యులు ఉరుకుంద, ఎల్లయ్య, రమణ, రేణుక, శివరాముడు, శ్రీనివాసులు, రమేష్, ఆంజి, చంద్రప్ప, నాగేంద్ర, గోపాల్, వెంకటేశ్వర్లు, సంజీవ, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఇంత అధ్వాన్నంగా పనులు చేయిస్తారా ?

-హంద్రీనీవా పనుల్లో నాణ్యత మరిచారు
-ఏడాదిగా వైసిపి వారిని టార్గెట్ చేస్తున్నారు
-రైతులకు యూరియా అందించలేకున్నారు.
-అధికారులపై జడ్‌పి చైర్మన్ పాపిరెడ్డి ఆగ్రహం
-జిల్లా పరిషత్ స్థాయి సంఘాల్లో పలు సమస్యలపై చర్చ

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

పత్తికొండలోని పందికొన 108.1 కిలో మీటర్ దగ్గర హంద్రీనీవా పనుల్లో లైనింగ్ గురువారం కురిసిన వర్షానికి కొట్టుకుపోవడంపై జిల్లా పరిషత్ చైర్మన్ ఎరబోతుల పాపిరెడ్డి హంద్రీనీవా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత నాసిరకంగా ఇంత అధ్వానంగా పనులు చేయిస్తారా? కనీసం నాణ్యత ప్రమాణాలు మరిస్తే ఎలా? రూ. 439 కోట్లతో నిర్మిస్తున్న పనుల్లో కనీస నాణ్యత ఉండాలి కదా అని ప్రశ్నించారు. హంద్రీనీవా ఇఇ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ వేసిన రోజునే వర్షం కురవడం వల్ల పోయిందని తెలిపారు. మీరు చెప్పే సమాధానాలు ఏవి వినేలా లేవని చైర్మన్ అన్నారు. దెబ్బతిన్న లైనింగ్ ఫోటోలను అధి కారులకు చూపించారు. శుక్రవారం జిల్లా పరిష త్ స్థాయి సంఘాల సమావేశం మినీ మీటింగ్ హాల్‌లో సిఇఒ నాసరరెడ్డి సమక్షంలో చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షత న నిర్వహించారు. గ్రామీణాభివద్ధి, విద్య, వైద్య., వ్యవసాయం, సాంఘిక సంక్షేమం, మహిళాభివద్ధి, శిశుసంక్షేమం, పనులు , ఆర్థిక ప్రణాళిక పై చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ పాపిరెడ్డి మాట్లాడుతూ రైతులకు రబీలో యూరియా సకాలంలో అందించ లేదని, కనీసం ఖరీఫ్ లో అయినా అందించాలని తెలిపామని, అయినా అధికారులకు చెవికెక్క లేదన్నారు. నంద్యాల జిల్లాలో అకాల వర్షానికి పంటలు, తోటలు దెబ్బతిన్నాయి వాటికి నష్టపరిహారంకు పంపాలని తెలిపారు. 10వ తరగతి రీ కౌటింగ్‌లో ఇంత అధ్వానంగా మార్కుల జాబితాలు ప్రచురిస్తారా అని ప్రశ్నించారు. ఏడాది కాలంగా వైసిపి వారిని వేదించడమే టార్గెట్ గా పెట్టుకున్నారని మైనింగ్ అధికారులపై ఆగ్రహించారు. కొలిమిగుండ్ల మండలం బెలుం సింగవరం గ్రామానికి చెందిన రామశంకర్ రెడ్డి పొక్లెయినర్‌ను,.టిప్పర్‌ను గతనెల నుండి పోలీస్ స్టేషన్‌లో పెట్టారని, నేటికీ దానిపై ఒక ఎఫ్ఐఆర్ రాయలేదన్నారు. ఇంత కక్ష సాధింపు ఎందుకని ప్రశ్నించారు. ఇలా చాలా చోట్ల కక్ష్య సాధింపు చేస్తున్నారని అన్నారు. ఆర్‌డ బ్ల్యుఎస్ అధికారులు తాగునీరు అందించడానికి అన్ని నిధులు అందించినా ఎందుకు సకాలంలో పనులు నిర్వ హించడం లేదన్నారు. నిర్దేశించిన తేదీనాటికి పూర్తి చేయాలి కదా ? వారం లోపు పూర్తి చేసి రిపోర్ట్ చేయాలని అన్నారు. అందుకు అధికారులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటా మన్నారు. కొత్తపల్లి జడ్‌పిటిసి మాట్లాడుతూ రైతులకు ఎక్కడ కూడా మినుములు అందుబాటులో లేవని, వ్యవసాయ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఓర్వకల్ జడ్‌పిటిసి మాట్లాడుతూ స్కూల్ లలో కార్యక్రమాలకు కనీస సమాచారం లేకుండా విద్యాశాఖ అధికారులు వ్యవహరిస్తున్నారని ప్రోటోకాల్ పాటించడం లేదన్నారు. చైర్మన్‌పాపిరెడ్డి మాట్లా డుతూ ప్రతి గ్రామంలో సర్పంచి నుండి మొదలు ఎమ్మెల్యే దాకా ప్రతి ఒక్కరికి ప్రోటోకాల్ పాటించాలని గత సమావేశాల్లో చెప్పామన్నారు. వినని వారికి మెమోలు ఇవ్వాలని విద్యాశాఖ అధి కారులకు తెలిపారు. అనంతరం సిఇఒ నాసరరెడ్డి మాట్లాడుతూ పాత జెడ్పి చైర్మన్ భవనం కోర్టు కేసులో ఉండటం వల్ల నిర్మాణం జరగలేదని, కేసు వేసిన వ్యక్తికి ఆ స్థలం దక్కిందని అందుకు తగిన నష్టాన్ని ఇస్తారని దానిద్వారా నూతన జడ్‌పి చైర్మన్ భవంతి నిర్మాణం జరగడానికి ఆమోదం పెట్టారన్నారు. జడ్‌పిటిసిలు ఏకగ్రీవంగా ఆమోదించారు. డిప్యూటి సిఇఒ వెంకట సుబ్బారెడ్డి, ఉమ్మడి జిల్లా జడ్‌పిటిసిలు, వివిధ శాఖల ఉమ్మడి జిల్లా అధికారులు, జిల్లా పరిషత్ అధికారులు అశ్విని కుమార్, జితేంద్ర, రామగోపాల్ ,భరత్, ప్రసాద్, పాల్గొన్నారు.

-హంద్రీనీవా పనుల్లో నాణ్యతను చూపుతున్న చైర్మన్ పాపిరెడ్డి

మలేరియా వ్యతిరేక మాసోత్సవ ప్రదర్శన

-జిల్లా సంచార చికిత్స నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

కోడుమూరు గ్రామ సర్పంచి భాగ్యరత్న ఆధ్వర్యంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవం పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామ ఆరోగ్య పారిశుధ్య పోషకాహార కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా సంచార చికిత్స కార్యక్రమం నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. జూన్ మాసంను ప్రభుత్వం మలేరియా వ్యతిరేక మాసోత్సవంగా నిర్వహించాలని తెలుపుతూ” మలేరియా అంతం మనతోనే అను నినాదంతో ప్రజలకు మలేరియాపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆడ ఎనాఫిలస్ దోమకాటు ద్వారా మలేరియా జ్వరం వస్తుందని, చలి జ్వరం ఉన్న వెంటనే గ్రామంలోని ఆరోగ్య కార్యకర్త దగ్గర రక్త పరీక్ష చేయించుకుని తగిన చికిత్స వీలైనంత త్వరలో తీసుకోవాలన్నారు. గ్రామ సర్పంచి భాగ్యరత్న మాట్లాడుతూ నివారణ చర్యలలో భాగంగా ఇంటి పరిసరాలలో పనికిరాని పడవేసిన తొట్లు, డబ్బాలు టైర్లు, కొబ్బరి చిప్పలు, మురుగు కాలువలలో నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు ఉత్పత్తి చెందుతాయని వాటిని ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పాటించి అన్ని నీటి నిల్వలను పాత్రలను శుభ్రపరిచి తిరిగి నింపుకోవాలన్నారు. దోమతెరలు వాడాలని ప్రజలకు వివరించినారు. ‘ దోమ పుట్ట రాదు, దోమ కుట్టరాదు, దోమలను నిర్మూలిద్దాం–దోమల ద్వార వచ్చే వ్యాధులను నివారిద్దాం అంటూ’ ప్రదర్శనలో నినాదాలు చేశారు. వైద్యాధికారి డాక్టర్ శ్రీమంత్ మాదన్న ,ఆరోగ్య విస్తరణ అధికారి నరసప్ప, శానిటరీ ఇన్స్‌పెక్టర్ వెంకటేశ్వర్లు ,హెల్త్ సూపర్వైజర్స్ కమాల్ సాహెబ్, ఉమాబాయి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ,ఆరోగ్య కార్యకర్తలు ,ఆశ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

కోడుమూరులో ప్రదర్శన చేస్తున్న వైద్యులు, సిబ్బంది

అన్నదాత సుఖీభవ పై సమీక్ష

ప్రజాశక్తి-సి బెళగల్

రైతులకు అన్నదాత సుఖీభవ పై ఎఒ మల్లేష్ కుమార్ శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్ పంటల సాగుకు భూములు పదను అయ్యాయని సాగులపై ముందుగా అవగాహన కలిగి పంట మార్పిడు పద్ధతులు తప్పని సరిగా పాటించాలని సూచించారు. పిల్లి పెసర, వేరుశెనగ 80 క్వింటాళ్లు, జీలుగా 50 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. రైతు సేవా కేంద్రంలో రిజిస్టర్ చేసుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీలుగ10 కేజీల ప్యాకెట్ రూ 615, వేరుశనగ 30 కేజీలు ప్యాకెట్ రూ 1674, పిల్లి పెసర ప్యాకెట్ ధర రూ.720 గా అందుబాటులో ఉందన్నారు.

నాణ్యతా లోపంతో హంద్రీనీవా పనులు

ప్రజాశక్తి-పత్తికొండ

హంద్రీనీవా ప్రధాన కాలువకు సిమెంట్ కాంక్రీట్ పనులలో నాణ్యత ప్రమాణాలు లోపించి గండి పడిందని పందికోన గ్రామస్తులు పేర్కొంటున్నారు. పత్తికొండ మండలం పందికోన గ్రామ సమీపంలో హంద్రీనీవా ప్రధాన కాలువ ప్రవహిస్తుంది. గ్రామంలో బుధవారం రాత్రి కురిసిన వర్షపు నీరు హంద్రీనీవా 108 కిలోమీటర్ల దగ్గర కాలువలోకి నీరు ప్రవహించి కోతకు గురై గండి పడింది. హంద్రీనీవా ప్రధాన కాలువ గండిపడడంతో గ్రామస్తులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. హంద్రీనీవా అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కుతో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదంటూ గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం పర్యవేక్షించి నాణ్యత ప్రమాణాలు పాటించాలని గ్రామస్తులు కోరారు.

6 ఇంచులు సిమెంట్ కాంక్రీట్....

పందికోన గ్రామస్తుడు వడ్డే హనుమంతు...

హంద్రీనీవా ప్రధాన కాలువకు ఆరు ఇంచులతో సిమెంట్ కాంక్రీట్ వేసి నాణ్యత ప్రమాణాలు పాటించలేదు. ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారని అధికారులపై మండిపడ్డారు. హంద్రీనీవా కాలువ తెగితే గ్రామం కొట్టుకుపోతుంది.

హంద్రీనీవా కాలువ పనుల్లో అవినీతి...

పత్తికొండ నియోజకవర్గంకాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బోయక్రాంతి నాయుడు..

హంద్రీనీవా ప్రధాన కాలువ పనులలో నాణ్యత లోపాలు ప్రత్యక్షంగా కనబడుతున్నాయి. ప్రజాధనం దుర్వినియోగం చేస్తూ అవినీతికి పాల్పడుతున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, జలవనురుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు లైనింగ్ పనులలో నాణ్యత లోపాలు, అవినీతిపై సమగ్ర విచారణ చేయాలని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేశారు.

,చిన్నవర్షానికే హంద్రీనీవా ప్రధాన కాల్వకు గండి

మాట్లాడుతున్న రాధాకృష్ణ

ఆదోనికేం చేశారు..?

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాధాకృష్ణ

ప్రజాశక్తి - ఆదోని

ఎన్నికల సమయంలో ఆదోని అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలం చెందిందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ విమర్శించారు. శుక్రవారం ఆదోనిలోని సుందరయ్య భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రెండో ముంబయిగా ప్రసిద్ధి గాంచిన ఆదోనికి ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలం చెందిందన్నారు. పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి అదనంగా మరో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కూలడానికి సిద్ధంగా ఉన్న పాత ఫై ఓవర్ బ్రిడ్జి మరమ్మతులు చేయడంలో, కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంలో శ్రద్ధ చూపడం లేదన్నారు. అర్ధాంతరంగా నిలిచిపోయిన మెడికల్ కళాశాల పనులు చేపట్టడంలో పూర్తిగా విఫలం చెందిందని విమర్శించారు. పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనేక వార్డుల్లో మురుగుదొడ్లు లేక మహిళలు ఇబ్బందులు పడుతున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, పట్టణ కార్యదర్శి వర్గసభ్యులు గోపాల్, తిప్పన్న, నాయకులు వీరేష్, నాగరాజు, వెంకటేష్, ఖాన్, నాగేంద్ర ఉన్నారు.

ఏడాదైనా అమలేది..?

- హామీలపై ఉలుకూపలుకు లేని 'కూటమి' - పెదవి విరుస్తున్న ప్రజలు

ప్రజాశక్తి - కౌతాళం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే 'ఇది చేస్తాం.. ఇది చేస్తాం' అంటూ ఎన్నికల ప్రచారంలో నాయకులు హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా హామీలు అలాగే మిగిలిపోయాయి. నెరవేర్చకపోవడంతో ప్రజలు పెదవి విరుస్తున్నారు...

గత ఎన్నికల ప్రచారంలో భాగంగా కౌతాళంలో ఏడాది క్రితం 'ప్రజాగళం' కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కా రెడ్డి, మంత్రాలయం ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డితోపాటు వివిధ జిల్లా, మండలాల నాయకులు హాజరయ్యారు. తాము అధికారంలోకి వస్తే ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలతో పాటు సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందిస్తామని హామీల వర్షం కురిపించారు.

వంద పడకలేవి..?

హామీల్లో ముఖ్యంగా కౌతాళంలో వంద పడకల ఆస్పత్రి నిర్మించి ప్రజలకు అంకితం చేస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో అత్యధికంగా వలస వెళ్లే మండలం కౌతాళంలో, ప్రజలు వలస వెళ్లడంతో ఎక్కువగా అనారోగ్యాలకు గురై ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే 100 పడకల ఆస్పత్రి మంజూరు చేస్తామని హామీఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. హామీలపై ఉలుకూపలుకు లేకపోవడంతో ప్రజల ఆశలు ఎదురుచూపులకే పరిమితమవుతున్నాయి. ఈ హామీపై బిజెపి నాయకులు, జిల్లా మంత్రులతో పాటు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అయినా కూడా ఇప్పటివరకు మంజూరు కాలేదు.

కౌతాళంలో ఏడాది క్రితం హామీలు ఇస్తున్న చంద్రబాబు (ఫైల్)

ఒహెచ్‌ఆర్ ట్యాంకులు మంజూరు కాలేదు

కౌతాళంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని మండల నాయకుల ద్వారా తెలుసుకున్న చంద్రబాబు ఒహెచ్‌ఆర్ ట్యాంకులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మండలంలో ప్రతి గ్రామంలోనూ ఇంటింటికీ కుళాయి మంజూరు చేసి రోజూ తాగునీరు అందేలా చూస్తామని పేర్కొన్నారు. ఏడాదయినా ఒహెచ్‌ఆర్ ట్యాంకులు మంజూరు కాలేదు. తాగునీటి సమస్య అలాగే ఉంది.

వలసల నివారణ ఎక్కడ..?

రాష్ట్రంలో అత్యధికంగా వలసలు వెళ్లే నియోజకవర్గం మంత్రాలయం పేరుగాంచడంతో, వలసలు నివారించి, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని కూటమి నాయకులు పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి పథకాలను పూర్తి చేసి వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసి వలసలు నివారించడానికి కృషి చేస్తామని హామీఇచ్చారు. వలసలను నివారించడానికి ఇప్పటివరకు ఎలాంటి ప్రత్యేకమైన చర్యలు తీసుకోకపోవడంతో, వలసలు అలాగే కొనసాగుతున్నాయి. వలసలు నివారించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు.

ప్రతి గ్రామంలోనూ సిసి రోడ్లు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి గ్రామంలోనూ సిసి రోడ్లు వేసి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం 'పల్లెపండగ' కార్యక్రమంలో భాగంగా 21 సిసి రోడ్లు మంజూరు చేసి, వేశారు. ఇప్పటివరకు బిల్లులు అందకపోవడంతో కాంట్రాక్టర్లు ఇబ్బంది పడుతున్నారు.

రైతులకు సాగునీరందిస్తాం

మండలంలోని రైతులందరికీ సాగునీరందిస్తామని చెప్పారు. ఇందులో భాగంగా తుంగభద్ర దిగువ కాలువకు మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేశారు. సిసి లైనింగ్, జంగిల్ క్లియరెన్స్, డిస్ట్రిబ్యూటరీ మరమ్మతు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

సూపర్ సిక్స్ పథకాలు అంతంతే..!

కూటమి నాయకులు ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజల్లోకి బాగా తీసుకెళ్లి అధికారంలోకి వచ్చారు. ఇందులో కొన్ని అమలయితే, మరికొన్ని పథకాలు అలాగే మిగిలి ఉన్నాయి. మిగిలిన నాలుగేళ్ల పాలనలో అన్ని హామీలు అమలవుతాయా..! లేదా అనేది వేచి చూడాల్సిందే. ఏడాది పాలనలో ప్రజలు ఆశ, నిరాశలతో పథకాల కోసం ఎదురుచూస్తున్నారు.

యాపిల్ ల్యాబ్‌లో తనిఖీలు

- యాపిల్ డయాగ్నోస్టిక్‌కు అన్ని అనుమతులూ ఉన్నాయి
- డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ సత్యవతి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

తనిఖీ చేస్తున్న డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ సత్యవతి

పట్టణంలోని యాపిల్ ల్యాబ్‌ను డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ సత్యవతి శుక్రవారం తనిఖీ చేశారు. జిల్లా అధికారులు యాపిల్‌ను తనిఖీ చేసి ట్రేడ్ లైసెన్స్, ఫాథలజీ సర్టిఫికెట్, బయో మెడికల్ సర్టిఫికెట్లు లేవని, యాపిల్ ల్యాబ్ అధినేత అధికారుల తనిఖీలు సమయంలో అందుబాటులో లేకపోవడంతో షోకాజ్ నోటీసు సిబ్బందికి ఇచ్చారు. డిప్యూటీ డిఎంహెచ్‌ఒ సత్యవతి తనిఖీలు నిర్వహించారు. ఇందులో అన్ని శాఖలకు సంబంధించిన అనుమతి పత్రాలను డిప్యూటీ డిఎంహెచ్‌ఒకు అందజేశారు. రికార్డులను పరిశీలించి ల్యాబ్‌లో ఉన్న ధరల పట్టికను, ల్యాబ్ పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. యాపిల్ డయాగ్నోస్టిక్ సెంటర్‌కు సంబంధించి రికార్డులు పూర్తి స్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. సెంటర్‌కు అన్ని అనుమతులూ ఉన్నాయన్నారు. ఎమ్మిగనూరులో ఉన్న రక్త పరీక్ష కేంద్రాలు, ప్రయివేట్ హాస్పిటల్స్, స్కానింగ్ సెంటర్ల యాజమాన్యం అన్ని శాఖల అనుమతులూ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రెన్యువల్ చేయించుకోలేని వారు కూడా రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శ్మశాన వాటికపై ఇరువర్గాలతో చర్చలు

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని చెట్నిహళ్లి గ్రామంలో నెలకొన్న శ్మశాన వాటిక స్థలం వివాదంపై తహశీల్దార్ కార్యాలయంలో అధికారులు శుక్రవారం చర్చలు జరిపారు. ఇరువర్గాలతో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఎస్పీ ఉపేంద్ర బాబు, తహశీల్దార్ ఎస్.రవి, సిఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్, మాధవరం ఎస్ఐ విజయ్ కుమార్ వేర్వేరుగా చర్చలు జరిపారు. తహశీల్దార్ కార్యాలయంలో వారు మొదట తలుపులు వేసుకుని మీడియాను కూడా అనుమతించకుండా సమావేశమై చర్చించారు. అనంతరం ఒక్కొక్క వర్గంతో సమస్య పరిష్కారానికి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. తదుపరి ఇరువర్గాల సమక్షంలో శ్మశాన వాటిక స్థలంపై ఎటువంటి నిర్ణయం తీసుకున్నా ఇరువర్గాల వారు ఆమోదించాలని సూచించారు. అలా కాకుండా అధికారులు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రెసిడెన్షియల్‌కు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని మధిర గ్రామం పాఠశాల విద్యార్థినులు ఎపి రెసిడెన్షియల్ పాఠశాలకు ఎంపికైనట్లు ఎంఇఒ-2 శోభారాణి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడారు. పాఠశాలలోని విద్యార్థులు అఖిల 72 మార్కులతో 283వ ర్యాంకు, అఖిలశ్రీ 71 మార్కులతో 315వ ర్యాంకుతో అరెకల్ రెసిడెన్షియల్ పాఠశాలకు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థినులకు ఉపాధ్యాయుడు అలీ సాహెబ్ మంచి శిక్షణ ఇవ్వడంతో ఎంపికయ్యారని చెప్పారు. విద్యార్థులను ఆమె అభినందించారు.

బహుమతులు ఇస్తున్న నాయకులు

ప్రజా సేవలో మేము సైతం

- గుడిసె ఆది కృష్ణమ్మ సేవా సమితి

ప్రజాశక్తి - ఆదోని

సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా నిర్వహించే కార్యక్రమాలకు తమవంతు సహాయం అందిస్తామని గుడిసె ఆది కృష్ణమ్మ సేవా సమితి సభ్యులు తెలిపారు. మండలంలోని పెద్దతంబలం గ్రామంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా పరుగు పందెంలో సజ్జెల గూడెం సంటెన్న అనే రైతుకు టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ ఆదేశాల మేరకు సేవా సమితి ఆధ్వర్యంలో నాయకులు శ్రీనివాసులు నర్సప్ప చేతుల మీదుగా విజేతలకు బహుమతి రూ.5 వేలు అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు కొండాపురం శ్రీనివాస్ మాట్లాడారు. ప్రజల కోసమే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రాబోయే రోజుల్లోనూ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. టిడిపి పెద్దతుంబలం నాయకులు బైచిగేరి ఈరన్న, నాగరాజు, రామాంజినేయులు, వీరేష్, నరసప్ప, రామదాసు, మాదాలపురమయ్య, యనుముల ఈరన్న ఉన్నారు.

యోగాతో ఆరోగ్యం : ఎంపిడిఒ

ప్రజాశక్తి - చిప్పగిరి

యోగా చేయడం ద్వారా ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత పొందుతామని ఎంపిడిఒ అల్లాబకాష్ తెలిపారు. శుక్రవారం మండల కార్యాలయంలో డిప్యూటీ ఎంపిడిఒ బాలన్న ఆధ్వర్యంలో మండలంలోని అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలకు యోగా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. యోగా చేయడం ద్వారా ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. ఈనెల 21న 11వ ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 5 లక్షల మందితో చేపడుతున్న యోగాంధ్ర కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారని తెలిపారు. ప్రపంచ రికార్డు నెలకొల్పే స్థాయిలో కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్, ఎఒ శ్రీనివాసులు, ఎంఇఒ సావిత్రమ్మ, హౌసింగ్ ఏఈ విజయ్ కుమార్, ఏపీఎం నాగార్జున, ఏపీవో జుబేర్ అహ్మద్ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భారీ జరిమానా

ప్రజాశక్తి- ఆలూరు

ఆలూరు పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు శుక్రవారం ఆలూరు సివిల్ కోర్టు జడ్జి భారీ జరిమానా విధించిందని ఎస్ఐ మహ్మద్ బాష తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆలూరు సిఐ పర్యవేక్షణలో ఆలూరు పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి పట్టుబడిన వాహనదారులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఐదుగురిని ఆలూరు కోర్టులో హాజరుపరచగా ఆలూరు కోర్టు ఒక్కొక్కరి రూ.10 వేల చొప్పున జరిమానా విధించిందని చెప్పారు. మళ్లీ తాగి వాహనం నడిపితే జైలు శిక్ష తప్పదని హెచ్చరించినట్లు తెలిపారు.

తహశీల్దార్‌ను కలిసిన నాయకులు

ప్రజాశక్తి- దేవనకొండ

దేవనకొండ తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన రామాంజినేయులును టిడిపి నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. దేవనకొండ మాజీ ఎంపిపి కప్పట్రాళ్ల రామచంద్రనాయుడు, సింగిల్‌విండో మాజీ ప్రెసిడెంట్ అలారుదిన్నె మల్లయ్య, మాజీ సర్పంచి ఉచ్చీరప్ప, టిడిపి నాయకులు కాకర్ల శాంతికుమార్ కలిసి శాలువాతో సన్మానించారు.

తహశీల్దార్‌ను కలిసిన మల్లప్ప

ప్రజాశక్తి - హాలహర్వి

హాలహర్వి తహశీల్దార్ లక్ష్మీనారాయణను నీటి సంఘం అధ్యక్షులు, తుంగభద్ర దిగువ కాలువ ప్రెసిడెంట్ పూజారి మల్లప్ప శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గూళ్యం గ్రామస్తులతో కలిసి ఆయన మాట్లాడారు. మండలంలో రెవెన్యూ సంబంధిత రీసర్వేలు, పట్టా భూములు వంటివి త్వరగా పూర్తిచేసి సమస్యలు లేకుండా చూడాలని కోరారు.

కర్ణాటక మద్యం నిషేధం : సిఐ

ప్రజాశక్తి - ఆదోని

కర్ణాటక మద్యం రవాణా చేసినా, విక్రయించినా చట్టరీత్యా నేరమని ఆదోని ఎక్సైజ్, ప్రొహిబిషన్ సిఐ సైదుల్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యాన్ని ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం మీడియా ముందు ప్రవేశపట్టారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడారు. మండలంలోని పెద్దతుంబలం గ్రామంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న నక్కల సునీల్‌ను అరెస్టు చేసి అతని వద్ద 120 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుని రిమాండ్‌కు తరలించి, అదే గ్రామానికి చెందిన మద్యం సరఫరా దారుడు నక్కల సురేష్‌పై కేసు నమోదు చేశామన్నారు.

మద్యాన్ని చూపుతున్న పోలీసులు

మాజీ ఎంపిపి హనుమంతమ్మ మృతి

- పలువురు నాయకుల నివాళి

ప్రజాశక్తి - నందవరం

హనుమంతమ్మ (ఫైల్)

నందవరం మండలం ముగతి గ్రామానికి చెందిన మాజీ జడ్‌పిటిసి, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముగతి ఈరన్న గౌడ్ తల్లి, మాజీ ఎంపిపి ఈడిగ హనుమంతమ్మ శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు చంద్రశేఖర్ చౌదరి, తిక్కారెడ్డి సోదరులు శ్రీనివాసులు రెడ్డి, నాయకులు బి.చంద్రశేఖర్, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మాధవరావు దేశాయ్, గురురాజ్ దేశాయ్, రైస్ మిల్ నారాయణరెడ్డి, మాచాపురం ఖాసీం వలీ, కన్వీనర్ చిన్నరాముడు, సోమలగూడూరు వెంకటరామిరెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, రామదాస్ గౌడ్, మిఠాయి నరసింహులు, ధర్మపురం గోపాల్, జగ్గాపురం చిన్న ఈరన్న, కలుగొట్ల కొండన్న గౌడ్, రామకృష్ణా రెడ్డి, జబ్బార్ నివాళులర్పించారు.

గుండెపోటుతో వైసిపి నాయకుడు మృతి

ప్రజాశక్తి - ఆస్పరి

శేఖర్ రెడ్డి (ఫైల్)

మండలంలోని శంకర బండ గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు శేఖర్ రెడ్డి (46) గుండెపోటుతో మృతి చెందారు. శుక్రవారం సర్పంచి విజయలక్ష్మి, వైసిపి మండల కోకన్వీనర్ పురుషోత్తం రెడ్డి వివరాల మేరకు... శేఖర్ రెడ్డి తన ఇంటి దగ్గర కూర్చొని ఉన్నవాడు కూర్చున్నట్లే కుప్పకూలి పోయారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే వారని తెలిపారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. మృతునికి భార్య కవిత, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. శనివారం శంకరబండ గ్రామంలో జరిగే శేఖర్ రెడ్డి అంత్యక్రియ ల్లో ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి పాల్గొని నివాళులర్పిస్తారన్నారు.

అక్రమ కేసులు తగదు

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు

ప్రజాశక్తి - ఆదోని

ప్రజా సమస్యల పరిష్కారానికి ఆందోళనలు నిర్వహించే వామపక్ష ప్రజాసంఘాల నాయకులపై అక్రమ కేసులు బనాయించడం తగదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు తెలిపారు. సెప్టెంబర్ 13, 2018న టిడిపి హయాంలో బనాయించిన కేసును ఆదోని జ్యుడీషియల్ కోర్టు కొట్టి వేయడంతో శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎక్కడో ప్రమాదం జరిగిందన్న కారణంతో ఆదోనిలో ఆటోలపై దాడులు చేసి పోలీసులు సీజ్ చేశారన్నారు. దీనిని నిరసిస్తూ అప్పట్లో ఆటోలతో ఆదోని భీమాస్ సర్కిల్‌లో ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు. సిపిఎం, సిపిఐ, వైసిపి నాయకులు, ఆటో డ్రైవర్లపై టూ టౌన్ పోలీసులు అక్రమ కేసు పెట్టారని తెలిపారు. విచారించిన న్యాయమూర్తి కేసు కొట్టి వేస్తూ తీర్పు ఇచ్చారని అన్నారు. 20 మంది ఆటో డ్రైవర్లు, ఆరుగురు సిపిఎం, సిపిఐ, వైసిపి నాయకులపై కేసు పెట్టి ఏడేళ్లు కోర్టుల చుట్టూ తిప్పారన్నారు. ప్రజలకు మద్దతుగా కార్మిక, కర్షకులకు తోడుగా వామపక్ష ప్రజా సంఘాలు నిజాయితీగా ర్యాలీలు, ధర్నాలు చేసి అండగా నిలుస్తున్నాయని తెలిపారు. తమ ఆందోళనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నాయకులు ఎవరూ వారి స్వలాభాల కోసం పనిచేయరని, అక్రమాలకు పాల్పడరని.. నిజాయితీగా తీర్పు ఇచ్చిన జడ్జికి కృతజ్ఞతలు తెలిపారు. సిపిఐ మాజీ కార్యదర్శి వీరేష్, వైసిపి నాయకులు వెంకటేశ్వర రెడ్డి, జైభీమ్ సాయిరామ్, మునిస్వామి, ఆటో యూనియన్ నాయకులు మహబూబ్ బాషా, దిలీప్, గడిగే వెంకటేశ్వర్లు, బోయ వీరేష్, మాదిగ రాజు, బి.వీరభద్రప్ప, హరిజన శ్రీనివాసులు, కురువ సోమన్న, ఉప్పర తిక్కన్న, సయ్యద్ జాఫర్ బాషా, గొల్ల హనుమేష్, గొల్ల గంగిరెడ్డి, కె.జ్ఞానేశ్వరరావు, దాసరి నరసింహులు, బెస్త నాగరాజు, తెలుగు వీరేష్, ఆంజనేయులు, అన్సర్ బాష, తదితరులపై కేసు కొట్టి వేసినట్లు చెప్పారు.

మాట్లాడుతున్న వెంకటేశులు

'ఖరీఫ్'కు సిద్ధం..!

- కురుస్తున్న వర్షాలు.. సంతోషంలో రైతులు...
- పొలాలను విత్తుకు సిద్ధం చేస్తున్న రైతులు
- కంది సాగుపై ఆసక్తి

విత్తుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

ప్రజాశక్తి - చిప్పగిరి

రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు రావడంతో గత రెండు వారాల నుంచి మంచి వర్షాలు కురుస్తున్నాయి. పదునైన వర్షాలు కురవడంతో రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు. మంచి వర్షాలు కురవడంతో రైతులందరూ పొలాలను సిద్ధం చేసుకోవడానికి ఎక్కువ ప్రాధాన్య తీస్తున్నారు. పొలాల్లో దుక్కులు దున్నితే మంచి దిగుబడి రావడానికి ఆస్కారం ఉంటుందని రైతులు అందుకనుగుణంగా పొలాలను సేద్యం ఎక్కువగా చేస్తున్నారు.

చిప్పగిరి మండలంలో మొత్తం 17,665 హెక్టార్లలో సాగు విస్తీర్ణం ఉంది. ఖరీఫ్‌లో సాగవుతున్న విస్తీర్ణం 7,400 హెక్టార్లు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసుకునే పంటలకు రైతులందరూ తమ తమ పొలాలను దుక్కులు దున్ని సిద్ధం చేసుకుంటున్నారు. పొలాలకు పేడ ఎరువులు వేస్తున్నారు. ఖరీఫ్‌లో ఎక్కువగా ఎర్రనేల పొలం ఉంది. అధిక భాగం కంది పంట, వేరుశనగ, కొర్రలు, సద్దలు, పత్తి వేసుకోవడానికి రైతులు ముందుకొస్తున్నారు. ఏ పంటలు వేసుకుంటే ఎక్కువ దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖాధికారులు కూడా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ముందుగా పొలాలను దుక్కి దున్నుకోవడం ద్వారా వర్షాలు వచ్చినప్పుడు తేమను పట్టుకుంటుందని, దానివల్ల ఒక వర్షం ఆలస్యమైనా పొలంలో ఉన్న తేమ పనికొస్తుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా పొలంలో వేసిన పంటనే మళ్లీ, మళ్లీ వేసుకోవడం మంచిది కాదని, పంట మార్పిడి చేసుకుంటేనే అధిక దిగుబడి రావడానికి అవకాశం ఉంటుందని వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కార్యక్రమాల ద్వారా వివరిస్తున్నారు. పొలాల్లో కృత్రిమ ఎరువులు వేసుకుంటే మంచి దిగుబడి వస్తుందని, వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు కూడా అవలంభించాలని రైతులకు వ్యవసాయధికారులు తెలుపుతున్నారు. ఫర్టిలైజర్స్ ఎరువులు వాడకం తగ్గించుకోవాలని రైతులకు సూచిస్తున్నారు. విత్తనాల్లో కూడా నాణ్యమైన వాటికి అధిక ప్రాధాన్యత ఇచ్చి ధర ఎక్కువైనా మంచి విత్తనాలు తీసుకోవాలని, నకిలీ విత్తనాలు తీసుకొని మోసపోవద్దని రైతులకు సూచిస్తున్నారు. వ్యవసాయంలో మోతాదుకు మించి పెట్టుబడులు పెట్టకుండా వ్యవసాయ అధికారులను ఎప్పటికప్పుడు సంప్రదించి వారు చెప్పినట్లు పాటిస్తే సాధ్యమైనంత వరకు పెట్టుబడులు తగ్గే అవకాశం ఉంది.

కంది సాగుకు ఆసక్తి చూపుతున్న రైతులు

- గురునాథ, రైతు, సంగాల గ్రామం

కంది పంట సాగు చేసుకోవడానికి పొలాలను సిద్ధం చేసుకుంటున్నాం. ఈఏడాది వర్షాలు బాగా కురుస్తుండడంతో పొలాలన్నీ మంచిగా పదును అవుతున్నాయి. కంది పంట సాగుకు బాగుంటుంది. అందుకనుగుణంగా కంది సాగు చేసుకోవడానికి మా రైతులంతా మంచి రకం కంది తీసుకొని పంట పండించడానికి ఆసక్తి చూపుతున్నాం.

నాణ్యమైన విత్తనాలు వాడాలి

- ఎఒ జయలక్ష్మి

ఈ ఏడాది వర్షాలు సమయానికి కురుస్తున్నందున కంది పంట సాగుకు బాగా ఉంటుంది. రైతులందరూ నాసిరకం విత్తనాలు వాడకుండా నాణ్యమైన విత్తనాలు వాడితేనే మంచి దిగుబడి వస్తుంది. నకిలీ విత్తనాలు తీసుకొని మోసపోకుండా వ్యవసాయ అధికారుల సూచనలు తీసుకొని మంచి విత్తనాలు తీసుకొని పంట సాగు చేసుకోవాలి.

పదో రోజూ నిరసన

ప్రజాశక్తి - ఆదోని

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కాంట్రాక్టు ఉద్యోగులు చేపట్టిన నిరసన శుక్రవారం పదో రోజుకు చేరింది. పట్టణంలోని భీమాస్ కూడలిలో చేపట్టిన నిరసన శిబిరానికి పలువురు మద్దతు ఇస్తున్నారు. శుక్రవారం దీక్ష శిబిరానికి టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి చేరుకుని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాగునీటి సరఫరా, వీధిలైట్ల ఏర్పాటు, కంప్యూటర్ విభాగాల్లో దశాబ్ద కాలంగా విధులు నిర్వర్తిస్తున్నా వారి సమస్యలు పరిష్కారం కావడం లేదని తెలిపారు. సమాన పనికి కనీస వేతనం రూ.29,500, నాన్ టెక్నికల్‌కు రూ.24,500 ఇవ్వాలని ఉద్యోగులు కోరుతున్నారని చెప్పారు. పదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారిని రెగ్యులర్ చేయాలని, విధుల్లో భాగంగా చనిపోయిన వారి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలు, డ్యూటీ చేస్తూ చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని అడుగుతున్నారని తెలిపారు. ఈ సమస్యలను నియోజకవర్గ ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడుతో సంప్రదించి ముఖ్యమంత్రి దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మహేష్, మూర్తి, అహ్మద్, శివ శంకర్, సోమన్న, సింగ్, భరత్, శంకర్, రామాంజనేయులు, చందు, చంద్ర, శివ, ప్రవీణ్ కుమార్, కుమార్, గోవిందు, ముక్కన్న ఉన్నారు.

శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న భూపాల్ చౌదరి

ఎస్సీ, బీసీల పక్షపాతి మాధవరావు దేశాయ్

- అభిమానులు

ప్రజాశక్తి - నందవరం

ఎస్సీ, బీసీల పక్షపాతి మాధవరావు దేశాయ్ అని ఆయన అభిమానులు తెలుగు ఈరన్న, బోయ మోహన్, బోయ సుధానంద, వంకగడ్డ వలీ సాబ్, శ్రీనివాసులు, సల్మాన్, నరసింహులు, దావీదు, చాంద్ బాషా, పృథ్వీరాజు, హుస్సేని, చాంద్ బాషా, సుభాన్ తెలిపారు. శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాధవరావు దేసాయ్ ఎస్సీ, బీసీలను కించపరిచారని కొంతమంది ఎస్సీ, బీసీ నాయకులు మాట్లాడారని తెలిపారు. ఆయన వారిని కించపరిచినట్లు ఎక్కడైనా రికార్డులుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. బీసీ, ఎస్సీలను కించపరిచే మనస్తత్వం కాదని, గ్రామంలో ఎస్సీ, బీసీ కుటుంబ సభ్యుల్లో ఒకరుగా మాధవరావు దేశాయ్ ఉంటున్నారని తెలిపారు. నాలుగేళ్లు అధికారం ఉంది కదా అని కొంతమంది ఎస్సీ, బీసీలను రెచ్చగొట్టి వ్యాఖ్యలు చేయడం మానుకొని, ఆయన మాట్లాడిన మాటలను మరోసారి విని ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు. మాధవరావు దేశాయ్ జూనియర్ అని.. మార్కెట్ యార్డు ఛైర్మన్ ప్రమాణ స్వీకారం చేసినప్పుడు రెండుసార్లు స్టే తెచ్చారని, ఆ విషయాన్ని ఆయన బాధతో వీడియో, పత్రికా పరంగా విడుదల చేశారని తెలిపారు. అందులో ఏ నాయకుని పేరు ప్రస్తావనకు తీసుకురాలేదని, ఆయన బాధను మాత్రమే వ్యక్తపరిచారని చెప్పారు. దానిని కూడా రాజకీయం చేస్తూ కొంతమంది నాయకులు పబ్బం గడుపుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. అలాగే ఎవరో చెప్పిన మాటలు విని మాధవరావును కించపరిచే వ్యాఖ్యలు చేశారన్నారు. ఆయన చెప్పి వ్యక్తి టిడిపి, ఆయన భార్య ఇంతకుముందు సిపిఐలో ఉన్నారని గుర్తు చేశారు. కుటుంబంలోనే అలా ఉంటే పెద్ద సముద్రంలాంటి టిడిపిలో ఒడిదుడుకులు, కోపతాపాలు, విమర్శలు ఉంటాయని, అర్థం చేసుకోవాలని కోరారు. సమస్యకు పరిష్కారం చూపాలి కానీ చిచ్చుపెట్టే మాటలు మాట్లాడడం పద్ధతి కాదని విమర్శించారు.

మాట్లాడుతున్న మాధవరావు దేశాయ్ అభిమానులు

IN THE COURT OF THE IIND ADOL CIVIL JUDGE (JUNIOR DIVISION): ADONI
O.S.No.144/2024

Between:
K. Vyshnavi Devi .... Plaintiff
-V/s-
F.T Basha and 4 others ..... Defendants

TO: D-1 TO D-4
D-1. Sri. F.T Basha 5/o Late. Mohammed Abdul Rasheed, aged about 50 years, resident of D.No. 19/332, Fareed Saheb Dargah Street, Adoni-518 301, Cell No.90329 01957.
D-2. Sri. F.T.Khader S/o Late. Mohammed Abdul Rasheed, aged about 45 years, resident of D.No.19/332, Fareed Saheb Dargah Street, Adoni-518 301, Cell No.90329 01957.
D-3. Smt. Fareeda D/o Late. Mohammed Abdul Rasheed, aged about 42 years, House wife, resident of D.No.19/332, Fareed Saheb Dargah Street, Adoni-518301, Cell No.90329 01957.
D-4. Sri. FT. Shasha S/o Late. Mohammed Abdul Rasheed, aged about 40 years, resident of D.No.19/332, Fareed Saheb Dargah Street, Adoni-518 301, Cell No.90329 01957

Whereas the above named the Plaintiff filed the above suit against the Defendants for declare the right and title of the Plaintiff against the Defendants in respect of Plaint A schedule property and deliver of possession of Plaint B schedule property which is part and parcel of Plaint A schedule property. You are hereby directed to appear before this Honourable court on **18-06-2025** either in persons or your Advocate and file written statement if any, failing which the matter will be decided in your absence and you will be set ex-parte.

Hearing Date: 18-06-2025

SHRI. Y.R.MALLIKARJUNA
ADVOCATE FOR PLAINTIFF.
KURNDOL DISTRICT.
ADONI-518301.

'కూటమి'తోనే విద్యార్థుల భవిష్యత్తు : టిడిపి

ప్రజాశక్తి - కోసిగి

రాష్ట్రంలో విద్యార్థుల బంగారు భవిష్యత్తు కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని టిడిపి డి.బెళగల్ గ్రామ నాయకులు తెలిపారు. శుక్రవారం డి.బెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా పథకం కిట్‌ను పిల్లలకు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాఠశాల కమిటీ ఛైర్మన్ తిక్కప్ప, టిడిపి గ్రామ యువ నాయకులు రామయ్య, సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, సూర్యకాంత్ రెడ్డి, ఐ టిడిపి నియోజకవర్గ అధ్యక్షులు సల్మాన్ రాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని కూటమి ప్రభుత్వం చదువుకునే పిల్లల కోసం పుస్తకాలు, బట్టలు, షూస్, మధ్యాహ్న భోజనంలో సన్న బియ్యం ఇస్తోందని తెలిపారు. అలాగే ఎంతమంది పిల్లలు చదువుకుంటే అందరికీ తల్లికి వందనం అందుతుందన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను బడికి సక్రమంగా పంపాలన్నారు. ఎంపిపి పాఠశాల ఛైర్మన్ వీరనాగప్ప, మాల అంపయ్య, బసవ లింగప్ప, హుస్సేని, ఉపాధ్యాయులు బందే ఖాజా బందన్, పవన్, సందానందన్, పీడీ శివ కూమార్, శ్రీలక్ష్మి, లక్ష్మీదేవి పాల్గొన్నారు. **నందవరం** మండలం హాలహర్వి గ్రామంలో ఎంపిపిఎస్ (డిపిఈపి) పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బసవరాజు అధ్యక్షతన విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాఠశాల కమిటీ ఛైర్మన్, టిడిపి హాలహర్వి గ్రామ అధ్యక్షులు ఎర్రన్న, టిడిపి సోషల్ మీడియా అధ్యక్షులు మణికుమార్ హాజరయ్యారు. ఉపాధ్యాయులు భాగ్యరాజు, మహబూబ్ బాషా, శశికళ, బూత్ కన్వీనర్లు కిష్టప్ప, ఆనంద్, టిడిపి నాయకులు చిన్న దావీదు, ఏసేపు, బోయ బుడ్డ రంగన్న, ఇమ్మానుయేలు, ప్రభాకర్, సంసోను, జయన్న, చిన్న దేవపాల్ పాల్గొన్నారు.


కోసిగిలో కిట్లను పంపిణీ చేస్తున్న నాయకులు

నందవరంలో కిట్లను పంపిణీ చేస్తున్న నాయకులు

15న సుజయీంద్ర ఆరోగ్యశాలలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - మంత్రాలయం

శ్రీరాఘవేంద్రస్వామి మఠం నిర్వహణలో ఉన్న శ్రీసుజయీంద్ర ఆరోగ్యశాలలో ఈనెల 15న ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆరోగ్యశాల కోఆర్డినేటర్ విజయీంద్ర రావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. పీఠాధిపతులు శ్రీసుబుధేంద్రతీర్థుల ఆదేశాల మేరకు అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కర్నూలుకు చెందిన ప్రఖ్యాత గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ వైద్య పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభం కానుందని తెలిపారు. కడుపు సంబంధిత సమస్యలతో బాధపడుతున్న రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్ ఎల్.రాజేంద్ర ప్రసాద్, ఎమ్‌డి, మెడిసిన్ (పిజిఐ చండీగఢ్) డిఎం గ్యాస్ట్రో (సిఎంసి, వెల్లూరు) గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, లివర్ స్పెషలిస్ట్‌లు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తారని తెలిపారు.